

ఆరోజు మధ్యాహ్నం హైద్రాబాద్ రేస్‌కోర్స్ జనసందోహంతో కిటకిటలాడుతూంది. టికెట్ కౌంటర్స్‌లో జనం బారులుతీరి ఉన్నారు. వి.ఐ.పి ఎన్‌క్లోజర్ దగ్గర కాంప్లిమెంటరీ పాసులు చూపిన వాళ్ళను సోదాచేసి మెటల్ డిటెక్టరు ఆర్చ్‌లోంచి లోపలికి పంపిస్తున్నారు సెక్యూరిటీ వాళ్ళు. ఆకాశం మబ్బులు పట్టి ఆహ్లాదంగా ఉంది వాతావరణం. సైకిళ్లు, బైకులు, ఆటోలు, చిన్నకార్లూ, పెద్దకార్లూ పార్కింగ్ లాట్ వైపు దూసుకెళ్తున్నాయి. అక్కడికి చేరిన వేలాది జనంలో స్త్రీలు దాదాపుగా లేరనే చెప్పాలి. వచ్చిన ఒకరిద్దరు కూడా వి.ఐ.పి ఎన్‌క్లోజర్ వైపే వెళ్తున్నారు. అక్కడంతా హాఫ్ స్లీవ్ షర్ట్స్, ట్రౌజర్స్, జీన్స్, టీ షర్ట్స్, ఫుల్ స్లీవ్ షర్ట్స్, కుర్తా పైజమాలు, లాల్చీలు, ధోవతులూ, రూమీ టోపీలు, కోట్లూ, టైలు ఇలా రకరకాల ఔట్‌ఫిట్స్‌ధరించి ఉన్నవాళ్ళతో మినీభారత్‌లా ఉంది. వాళ్ళంతా గుర్రప్పందేలు చూడాలనే ఆసక్తితో, పందెం కాయాలనే ఆకాంక్షతో వచ్చిన వాళ్ళే.






వాళ్ల మొహాల్లో ఉత్సాహంతోబాటు ఉత్కంఠ గోచరిస్తూంది. చిరుగాలులు ఒంటికిసోకి హాయిగొలుపుతూంటే కొంతమంది గేట్ల దగ్గరా బుకింగ్ కౌంటర్ల పక్కన బృందాలుగా చేరారు. కొందరు వాళ్ళ చేతుల్లో ఉన్న రేస్ ప్రోగ్రామ్ పుస్త కాలు చూస్తూంటే – మరి కొందరిమధ్య గుర్రాల గురించీ, బెట్టింగ్ గురించీ చర్చలూ, వాదనలూ సాగుతున్నాయి. ఇంతలో తళతళలాడుతూన్న నల్లటి బెంట్లీ కారొచ్చి ఆగిందక్కడ. చాలా మంది దృష్టి అటు మళ్ళింది. డ్రైవింగ్ సీట్లోంచి యూనిఫాంలో ఉన్న డ్రైవరు దిగి వెనక డోర్ తెరిచి పట్టుకున్నాడు. గ్రే కలర్ సూట్ వేసుకున్న పెద్దాయన దిగాడు. బాగా పొడుగ్గా హుందాగా ఉన్నా డాయన. జుట్టూ మీసాలూ ముప్పాతిక శాతం నెరిసినా తీరైన శరీరాకృతితో హుందాగా కన్పిస్తున్నాడు. ఆ కారు మరోవైపు నుంచి ఓ అమ్మాయి దిగింది. వయసు ఇరవైకి అటూ ఇటూగా ఉంటుందేమో? చామన చాయతో ఉన్న ఆమె తెలుపునలుపు రంగులు కలగలిసిన డ్రెస్ వేసుకుంది. స్ట్రెయిటన్ చేసి వదులు కున్న జుట్టు రాగిరంగులో మెరుస్తూంది. చురుకైన పెద్దకళ్ళు, దట్టంగా ఉన్న కనురెప్పలు, ఆమె వంకచూస్తూన్న అందరి చూపుల్ని అక్కడే నిలిపేస్తున్నాయి. మరీ సన్నగా, అటు లావుగా లేని ఆమె హెల్తీలుక్‌తో ఆకర్షణీయంగా ఉంది. కార్లోంచి దిగిన వాళ్ళిద్దర్నీ చూసి అక్కడి సెక్యూరిటీ స్టాఫ్ సలామ్‌లు కొట్టారు. వాళ్ళ వంక చూస్తూన్న వాళ్ళలో కొందరు ''నరేంద్రనాథ్‌గారు మనవరాలితో వచ్చారు'', అని మాట్లాడుకుంటున్నారు. ఎన్‌క్లోజర్ వైపు వెళ్తున్న రేస్‌క్లబ్ మెంబర్స్ ఆ పెద్దాయనకు గౌరవంగా విష్ చేస్తున్నారు. ఆయనకక్కడ బాగా పరపతి ఉన్నట్లర్థమవుతూంది. పందెపు గుర్రాల యజమాని ఒకరు ''హౌ ఆర్యూ సాగరికా'' అంటూ ఆ అమ్మాయిని ఆప్యాయంగా పలుకరించాడు. ''ఐ యామ్ ఫైన్, అంకుల్... మొదటి రేసులో మీ శివాజీ హాట్ ఫేవరేట్ కదా!'' అన్నది నవ్వుతూ.

''యా... కానీ గెలవాలి కదా... నీ క్లియోపాత్రా ఏకంగా ఈ రోజుటి ముఖ్య మైన డెక్కన్ డర్బీరేసులోనే పాల్గొనడానికి ఎలిజిబిలిటీ సంపాదించింది. కంగ్రాట్స్ మై డియర్'' అన్నాడు నవ్వుతూ.

''థాంక్స్ అంకుల్'' చిరునవ్వుతో అంటూ నరేంద్రనాథ్ గారి చెయ్యి పట్టుకుంది ''తాతయ్యా ముందుగా స్టేబుల్‌కి వెళ్దాం'' అన్నది. ఆయన సరే నన్నట్లుగా తల వూపాడు. లోపలికి వెళ్ళగానే కుడి వైపుకు తిరిగారిద్దరూ కొంత దూరం నడిచాక పందెపు గుర్రాల నుంచిన స్టేబుల్స్ కనిపించాయి. ఆ అమ్మాయి నలుపురంగు గుర్రం దగ్గర ఆగింది. అక్కడే ఉన్న దాని ట్రెయినర్ చిన్నగేటు తీశాడు. ఆమె లోపలికి నడిచింది. సూర్యుణ్ణి కప్పి ఉంచిన మబ్బులు అప్పుడప్పుడే విడుతున్నాయి. సూర్యకిరణాలు ఏటవాలుగా వచ్చి గుర్రంపై పడుతూంటే నల్లని దాని చర్మం ఆరోగ్యంగా నిగనిగలాడుతూ నీడలు


WORLD CLASS TREATMENT



డా॥ రాయ్

Estd : 1950

గుప్తరోగములన్నింటికి శాస్త్రీయమైన పద్ధతితో అసమానమైన చికిత్స, సుఖమయమైన దాంపత్య జీవితం, కొత్త యవ్వనం కొరకు సంప్రదించండి

శీఘ్రస్కలనము సంతానం లేని వారు మరియు అంగము చిన్నదైనచో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధునిక పరికరముల ద్వారా చికిత్స చేయబడును.

డా॥ రాయ్స్ క్లినిక్

సెంట్ మేరీస్ రోడ్, మనోహర్ టాకీస్ ప్రక్కన, సికింద్రాబాద్.

Ph: 27807796, 27717839

OLDEST CLINIC WITH LATEST TECHNOLOGY

తేల్తోంది. దాని కళ్ళు కనకపుష్యరాగాల్లా మెరుస్తున్నాయి. సాగరిక దగ్గరగా వెళ్ళి దాన్ని ఆప్యాయంగా నిమురుతూ ''హాయ్ హనీ... హౌ ఆర్యూ...'' అంటూ మెడ చుట్టూ చేయి వేసి దగ్గరగా పొదవి పట్టుకొని వదిలింది. సాగరికను చూడగానే అది ఆమెను పలుకరిస్తున్నట్లుగా తలకాస్త పైకెత్తి చిన్నగా సకిలించింది.

నరేంద్రనాథ్‌గారు డైమెండ్స్ పొదిగిన బ్లాక్‌డయల్‌రాడో రిస్ట్‌వాచ్‌లో టైమ్ చూస్తూ ''సాగరీ, లంచ్ రెడీగా ఉంటుంది నువ్వు డైనింగ్ హాలుకు వెళ్ళు తల్లీ!'' అన్నాడు.

''మీరూ వస్తే కలిసే చేద్దాం'' అన్నది.

''నువ్వు వెళ్తూండు నేను వీళ్ళతో మాట్లాడి వచ్చేస్తాను'' అన్నాడు అక్కడున్న ట్రెయినరూ, జాకీల వంక చూస్తూ.

సాగరిక కర్థమైంది ఆయన వాళ్ళతో పర్సనల్‌గా మాట్లాడాలనుకుంటున్నాడని.

ఆమె రేస్ క్లబ్ వైపు నడిచింది. లిఫ్ట్ ఎక్కి మూడో అంతస్తు చేరుకుంది. రెస్టరూం కెళ్ళి ఫ్రెష్ అప్ అయ్యి డైనింగ్ హాల్లోకి వెళ్ళింది. సెంట్రలైజ్ ఏ.సి ఉన్న పెద్దహాలు అది. ఓ పక్కగా రెండు పెద్ద సోఫాసెట్లు వేసి ఉన్నాయి. హాలు మధ్యలో చిన్న చిన్న గుండ్రని టేబుల్స్ వాటి చుట్టూ నలుగురూ కుర్చొని భోంచేయడానికి అనువుగా వేసిన కుర్చీలూ ఉన్నాయి. మరో పక్క బఫే లంచ్‌కి అన్నీ సిద్ధంచేసి ఉన్నాయి. ఎల్ ఆకారంలో అమర్చిన ఆ టేబుల్స్ పైన బర్నర్స్ సెగలో రకరకాల వంటకాలు పొగలు కక్కుతున్నాయి. అప్పటికే అక్కడ కొంత మంది ప్లేట్లలో భోజనం వడ్డించుకుంటున్నారు. రేస్‌కోర్స్ స్టీవర్డ్స్‌కు, మెంబర్స్‌కూ వాళ్ళ అతిథులకూ మాత్రమే ప్రవేశముంటుందక్కడ. హాల్లోకి వచ్చిన సాగరికను చూస్తూనే ''తాతగారు రాలేదా బేబీ'' అని అడిగాడు స్టీవర్డ్ మహీధరరావు.

''స్టేబుల్ దగ్గర ఆగారు... వచ్చేస్తారు... నవీన్ రాలేదా అంకుల్'' అడిగింది. క్రికెట్ మ్యాచ్ చూడ్డానికి ఫ్రెండ్స్‌తో లండన్ వెళ్ళాడు. హైద్రాబాద్‌లో ఉంటే డర్బీడే మిస్ చేస్తాడా...?'' నవ్వుతూ అన్నాడు దొంతరలోంచి ప్లేటు తీసి సాగరికకిస్తూ ''కమ్, లెట్స్ హావ్ లంచ్'' అన్నాడు. థాంక్స్ అంకుల్, మీరు కానివ్వండి నేను తాతయ్య కోసం చూస్తున్నాను'' అన్నది.

''దెన్ టేక్ యువర్ సీట్. ఐ విల్ సెండ్ సమ్ ఎపిటైజర్స్...'' అన్నాడు.

తాతగారి కోసం ఎదురు చూస్తూ కిటికీ పక్కనే వేసి ఉన్న సోఫాలో కూర్చుంది. పెద్ద గ్లాస్‌విండో లోంచి రేస్‌కోర్స్ అంతా కన్పిస్తూంది. గుర్రాలు పరిగెత్తే రేసింగ్ ట్రాక్ అంతా శుభ్రం చేస్తున్నారు స్వీపర్లు. ట్రాక్‌కు ఓ వైపు మీటర్లు సూచించే బోర్డ్స్ ఉన్నాయి. రేస్‌కోర్స్ మధ్యలో ఆ పందేలను ప్రేక్షకులు స్పష్టంగా చూడడానికి వీలుగా వైడ్ డిజిటల్ స్క్రీన్ అమర్చి ఉంది. ఆ పక్కనే పందేల వివరాలు, గుర్రాల ధరలూ తెలిపే ఎలక్ట్రానిక్ బోర్డ్స్ ఉన్నాయి. అప్పటికే మొదటి రేస్‌లో పాల్గొనే గుర్రాల వివరాలూ, ధరలూ చూపుతూంది ఆబోర్డ్. పాతికెకరాల పైగా ఉన్న సువిశాలమైన ఆ రేస్‌కోర్స్ చుట్టూ విస్తరించిన నగరం అందంగా కన్పిస్తూంది.




హాల్లో అంతా షాండిలియర్స్ విరజిమ్ముతున్న లైట్లవెలుగూ, పగటి వెలుగూ కలగలిసి పరుచుకొని ఉంది. ఏసి చల్లదనం నిండిన ఆ సౌండ్‌ప్రూఫ్ హాల్లోంచి నిశ్శబ్దంగా కన్పిస్తున్న అందమైన దృశ్యాన్ని ఆస్వాదిస్తూ ఆలోచనల్లో మునిగింది సాగరిక. బాంబే ఢిల్లీ, ఊటీ, బెంగుళూర్, చెన్నై, కలకత్తా...ల్లోని రేస్‌కోర్సుల కంటే ఇదే నచ్చుతుంది తనకు. అమ్మా నాన్న బిజినెస్ పనుల్లో తలమునకలై ఉంటే తను చిన్నప్పట్నించీ తాతయ్య పెంపకంలో పెద్దదైంది. ఆయనతో బాటు ప్రతీ వేసవిలో ఊటీ ఎస్టేట్‌కెళ్ళేది. అక్కడ తమకు స్టడ్‌ఫామ్‌లున్నాయి. తాతయ్య ఒకప్పుడు పెద్ద బిజినెస్ టైకూన్. సెల్ఫ్‌మేడ్ మనిషి. విజయసోపానాలధిగమించడమే ఆయనకు తెలుసు. డబ్బు సంపాదించడమే కాకుండా మంచి వ్యక్తిగా కూడా పేరు తెచ్చుకున్నాడు. సమాజంలో అరుదైన గౌరవాన్ని కూడగట్టుకున్నాడు. బిజినెస్ అంతా కొడుకూ, కోడలికీ అప్పగించి తెరవెనకనించి అవసరమైన సలహాలిస్తూ తనకు తానుగా రిటైర్మెంటు తీసుకున్నాడు. ఆయన హాబీగా పెట్టుకున్న వ్యాపకాల్లో ఇదొకటి. చిన్నప్పట్నించీ తనకి కూడా గుర్రాలన్నా, గుర్రపుస్వారీ అన్నా ఇష్టంగా ఉండేది. పద్దెనిమిదేళ్ళు నిండినప్పట్నించీ తాతయ్య వెంట గుర్రప్పందేలకు వెళ్తుండేది. ఆయన పోషణలో చాలా గుర్రాలున్నాయి. ఎక్కువ రేసుల్లో గెలిచిన రోమన్‌కింగ్‌కూ, ఆస్ట్రేలియాలో ఉన్న ఆయన స్నేహితుని గుర్రం బ్లాక్‌రోజ్‌కూ పుట్టిన ఈ నల్లగుర్రాన్ని తనకు కానుకగా ఇచ్చారాయన. దానికి 'క్లియోపాత్రా' అని పేరు పెట్టుకుంది. పందెపు గుర్రంగా పెంచాలనుకుంది. తాతయ్య సలహాతో మంచి ట్రెయినర్‌ను అపాయింట్ చేసింది. మంచి పోషణలో ఎదుగుతూన్న క్లియోపాత్రా పొంకం, పొగరు కలగలిసిన పడుచుపిల్లలా ఉంటుంది. రేండేళ్ళు నిండాక క్లియోపాత్రా రేసుల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెల్చుకుంది. దానికెక్కడా ఓటమి లేదు. డర్బీరేసులో పరిగెత్తడానికి అర్హత సాధించింది. ఈరోజు తన పుట్టిన్రోజు. ప్రతీ బర్త్‌డేకీ తాతయ్య సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చేవాడు. ఆయనిచ్చిన ప్రతీ కానుకా అపురూపమైనదే. ఈసారి కూడా అది ప్రత్యేకంగానే ఉంటుంది. ఆయనిచ్చే గిఫ్ట్ కోసం ఎగ్జైటింగ్‌గా ఎదురుచూడటం తనకు సరదా... ఈరాత్రి గ్రాండ్ కాకతీయలో ఏర్పాటు చేసిన విందులోపు తాతయ్యా తన కివ్వాలనుకున్న గిఫ్ట్ ఏమిటో తెలుస్తుంది....?

''సాగరీ... పదమ్మా లెట్స్ హావ్ లంచ్'' భుజంపై వేసిన తాతయ్య చేతి స్పర్శతో ఆలోచనలకు బ్రేక్ వేసి ఇటు తిరిగింది. డైనింగ్ హాల్లో గోడ గడియారం ఒంటిగంట కొట్టింది. వీళ్ళు భోజనాల బల్లల దగ్గరికి వచ్చారు. పొగలు కక్కుతూన్న సూప్‌ను బౌల్స్‌లోకి సర్వ్ చేసుకొని భోజనానికి ఉపక్రమించారు. మరి కాసేపట్లో మొదటి రేస్ స్టార్ట్ అవుతుందనడానికి సూచనగా పెడాక్‌లోకి రేసు

గుర్రాలన్నీ చేరాయి. సైస్‌బాయ్స్ పంటర్లు చూడడానికి వీలుగా వాటిని వృత్తాకారంలో తిప్పారు కాసేపు. ట్రైనర్ల సూచనలతో జాకీలు గుర్రాలనెక్కి జీన్‌లపై కూర్చుంటున్నారు. పోటీకి రంగం సిద్ధమవుతూంది....

***

ముఖ్యమంత్రి వెంట ఉన్న సి.వి.రావు శరీరం కాన్వాయ్‌లో ఉన్నా మనసంతా రేస్‌కోర్స్‌లోనే పరిభ్రమిస్తూంది. ఆరోజు అక్కడ జరగబోయే డక్కన్ డర్బీరేస్‌కు వెళ్ళాలని ఎన్నో రోజులుగా ప్లాన్ చేసుకున్నాడు. ప్రతీయేడూ అక్టోబరు 2న జరిగే ఆ ఈవెంట్‌కు ఈసారి ఫ్యామిలీతో వెళ్ళాలనుకున్నాడు. గవర్నమెంట్ నామినేట్ చేసిన రేస్‌క్లబ్ స్టీవర్డ్ మహీధర్‌రావు తనకు బాగా సన్నిహితుడు. ఆయన గెస్ట్‌గా వెళ్ళి రేస్‌క్లబ్‌లో లంచ్ చేసి మెంబర్స్ ఎన్‌క్లోజర్‌లో దర్జాగా కూర్చొని రేస్‌లు చూడాలనుకున్నాడు. పొద్దుటే మహీధర్ తనింటికి పాసులు పంపించేశాడు. గాంధీ జయంతి కావడంతో ఆ రోజు సెలవు. పెందళాడే సి.ఎమ్‌తో బాపూఘాట్‌లో శ్రద్ధాంజలి ఘటించాక పార్టీ ఆఫీసులో మీటింగ్ ఉంటుంది. ఆతర్వాత కాసేపు నూలు వడికే కార్యక్రమం, రక్తదాన శిబిరానికి, జైలుకి వెళ్ళి రావటం ఉంటాయి. ఆపై ఇక పెద్దగా ప్రోగ్రాం లేవీ ఉండవు కాబట్టి త్వరగా ఇంటికి వెళ్ళచ్చనుకున్నాడు. ''ఒంటిగంట కల్లా ఇంటికి వచ్చేస్తాను మీరంతా సిద్ధంగా ఉంటే వెంటనే బయల్దేరచ్చు'' అని భార్య రాధికతో చెప్పివచ్చాడు. కానీ పార్టీ ఆఫీసులో మీటింగ్ ముగిసేసరికి అనుకోని ఉపద్రవంలా తీవ్రవాదుల కార్యకలాపాలకు సంబంధించిన ఇన్‌ఫర్మేషన్ ఏదో రావడంతో అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేయాల్సివచ్చింది. ఇక తప్పనిసరి పరిస్థితిలో చిక్కుకున్నాడు. ఒంటి గంటయ్యింది. తానిప్పట్లో ఈ మీటింగ్ లోంచి బయటపడేలా లేదు. అక్కడ రేస్‌క్లబ్‌లో లంచ్ మొదలవుతుంది. తానెటూ వెళ్ళలేడు. అంత చక్కటి అవకాశం ఇంట్లో వాళ్ళెందుకు మిస్సవ్వాలి అనుకుంటూ సెల్ చేతిలోకి తీసుకున్నాడు. అవతలి వైపు బావమరిది రవికాంత్ లైన్లోకి వచ్చాడు. ''బావా మేమంతా రెడీ మీ కోసమే చూస్తున్నాం...'' అన్నాడు.

''నేను రాలేను రవీ ఎమర్జెన్సీ మీటింగ్‌లో ఉన్నాను. మీరు వెళ్ళండి... చూడూ నా పాస్ వృధా చేయకు. అక్కడ లంచ్ అదీ బావుంటుంది. నీ ఫ్రెండ్ నెవరినన్నా తీసికెళ్ళు'' అని ఫోన్ కట్ చేశాడు.

***

రవికాంత్ చెప్పింది విన్న రాధిక మార్చుకోవడానికి చేతిలోకి తీసుకున్న చీర విసురుగా పక్కన బెడుతూ ''అనుకున్నాను ఇలాగే జరుగుతుందని, మీ బావ రాకపోతే నేనూ రానురా నువ్వూ పిల్లలూ వెళ్ళండి'' అన్నది.

ఆమె ముఖంలో నిరుత్సాహం గమనించిన రవికాంత్ ''మేమంతా ఉన్నాం కదక్కా... వెళ్దాం త్వరగా రెడీ అవ్వు...'' అన్నాడు.

''ఈ సారికి మీరు వెళ్ళండి... టైమైంది బయల్దేరండి...'' అన్నది రాధిక తొందర పెడుతూ.

రవికాంత్ కోటు వేసుకొని రాహుల్‌కి టై సర్దుతూనే ఫ్రెండ్‌కి ఫోన్ కలిపాడు. ''ఒరేయ్ మధూ ఎన్నాళ్ళుగానో రేస్‌కోర్స్ కెళ్ళాలి రేసులు చూడాలి అనేవాడివి కదా రెండు పాస్‌లు ఉన్నాయి. త్వరగా రెడీ అవ్వు కోటూ, టై వేసుకోవాలి డ్రెస్‌కోడ్ పాటించకపోతే డైనింగ్ రూంలోకి రానివ్వరు తెలుసా?... ఒకేనా రేస్‌కోర్స్ గేటు ముందు కలుసుకుందాం... బై...'' ఫోన్ కట్ చేసి, ''పదండి వెళ్దాం'' అంటూ రవళి వంక చూశాడు. డెనిమ్‌స్కర్ట్, క్రోశాటాప్‌లో ఆమె చిన్న పిల్లలా ఉంది. నిన్నిలా చూస్తే పద్దెనిమిదేళ్ళని ఎవరూ నమ్మరు. అండర్ ఏజ్ వాళ్ళని లోపలికి వెళ్ళనివ్వరు. ఎందుకైనా మంచిది నీ కాలేజీ ఐ.డి కార్డ్ పట్టుకురా, సెల్‌ఫోన్లు ఇంట్లోనే వదిలేయండి. ఎటూ లోపలికి తీసికెళ్ళనివ్వరు. అవునూ ఇంకో పాసు మిగిలిపోయింది కదూ... ఆ ఎదురింట్లో ఉంటాడే నీ ఫ్రెండ్ అనిరుద్ధ్ వస్తాడేమో కనుక్కొని ఐదునిమిషాల్లో రెడీ అవమను... క్విక్ త్వరగా వెళ్ళి కనుక్కో'' మేనల్లుడు రాకేష్‌ని తొందరపెట్టాడు రవికాంత్.

***

టికెట్ కోసం క్యూలో నిల్చున్నారు ముకుందం, రాజేశ్వరరావులు. ముకుందం ఉల్లాసంగా కనబడుతున్నాడు. రేసుల వివరాలు పుస్తకంలో చూపుతూ మొదటిరేసులో శివాజీ ఫేవరేట్ అని ఇచ్చారు కానీ క్లౌడ్‌నైన్ గెలుస్తుందని నా సిక్స్‌సెన్స్ చెబుతూంది. నా అంచనా ఎప్పుడూ తప్పదు తెలుసా'' అంటున్నాడు అతని కళ్ళముందు పందెం గెలిచిన డబ్బుతో చిన్నింటికి ఆవిడ కోరిన పట్టుచీర కొనుకెళ్తున్న దృశ్యం కదలాడుతుంది. అతని మాటలు వింటూ రాజేశ్వరరావు ''నిన్ననే జీతం డబ్బులందాయి. ఆ కాస్తా ఈ రేసుల్లో తగలెడితే ఎలా... అసలే పండగ నెల కాస్త భయంగానే ఉందిరా'' అన్నాడు.

''ఛాన్స్ తీసుకోవాలి రా గెలిస్తే రెట్టింపు డబ్బువచ్చి పండుగని గట్టెక్కిస్తావు'' ముకుందం మాటలకడ్డు వస్తూ అన్నాడు.

''మరి ఓడితే...'' అనుమానంగా అడిగాడు రాజేశ్వరావు.

''మార్వాడీ దగ్గర మరో వెయ్యి అప్పుపెరుగుతుంది అంతే కదా...! జీవితం అన్నాక ఆ మాత్రం రిస్క్ తీసుకోకపోతే ఫన్నే ముంటుంది చెప్పు.. అంటూనే టిక్కెట్టు కొని లోపలికి దారి తీశారు. ఈ మధ్యనే సహవాస దోషం వల్ల గుర్రప్పందేలకు రాజేశ్వరావుకి రావటం అలవాటయ్యింది. మొదట్లో చూడడానికి వచ్చేవాడు. మెల్లమెల్లగా పదీపరకా కాయటం మొదలు పెట్టాడు. అది కాస్తా సరదాగా మారి వందల్లోకి దిగింది. వాళ్ళు లోపలికి వెళ్ళాక అల్లంత దూరంలో వజ్రపు చెవిపోగులు ధగధగ లాడిస్తున్న మార్వాడీసేఠ్ దర్శన మిచ్చాడు. ఇద్దరూ మొహాలు దాచుకుంటున్నట్లుగా తలలు పక్కకు తిప్పుకున్నారు. అసలే ఈ నెల వడ్డీ కూడా కట్టలేదు. తమనిక్కడ చూశాడంటే నిల్చోబెట్టి మరీ వసూలు చెయ్యగలడు అనుకుంటూ....

***

పావుగంటలో రేస్‌కోర్స్ చేరుకున్న రవికాంత్ బృందం హడావిడిగా డైనింగ్ హాల్లోకి చేరారు. అప్పటికి దాదాపుగా అక్కడున్న వాళ్ళందరూ తినడం పూర్తికావచ్చింది. వీళ్ళు వెళ్తూనే ఎంట్రీ దగ్గర రిజిష్టర్ బుక్‌తో ఉన్న అతనికి




పి.వి. రావు ఫ్యామిలీ గెస్ట్ ఆఫ్ స్టీవర్డ్ మహీధరరావు అని చెప్పాడు రవికాంత్. అతను బుక్‌లో నోట్ చేసుకున్నాడు. వీళ్ళంతా వెళ్ళి సూప్ తీసుకుంటున్నారు. పక్క టేబుల్ వైపు నించి మాటలు వినబడుతున్నాయి. ''దట్స్ ఎనఫ్ తాతయ్యా... మీ కసలే అది సరిపడదు..''

''వన్ మోర్ స్కూప్ రా సాగరీ...'' బతిమాలినట్లుగా అంటున్నాడు పెద్దాయన.

''నో తాతయ్యా ఆస్తమా అటాక్ వస్తుంది... కావాలంటే ఆ ఫిర్నీ తీసుకొండి కొంచెం...'' అంటూన్న ఆ అమ్మాయి వైపు చూసిన రవళి వెంటనే రవికాంత్ చెవిలో గుసగుసగా ''అటు చూడు మావయ్యా... పేజ్ త్రీలో రెగ్యులర్‌గా వస్తుందే సాగరిక... ఎంతో బావుంది కదా...! ఉత్సాహంగా అనేసింది.


''అవునవును నిజమే కానీ అలా గుడ్లప్పగించి అటే చూడకు బావుండదు'' అన్నాడు రవికాంత్.

రాకేష్, మధులు ఏ.సి చల్లదనాన్ని ఆస్వాదిస్తూ వేడిగా రుచికరంగా ఉన్న ఆ చిక్కటి చికెన్ కార్న్ సూప్ తాగుతూనే హాలంతా కలియజూస్తూ క బుర్లలో పడ్డారు. ఏమీ తీసుకోకుండా మౌనంగా కూర్చున్న అనిరుద్ధ్ వంక చూసాడు రవికాంత్ ''అదేంటీ సూప్ నచ్చలేదా అయితే భోజనం వడ్డించుకో... త్వరగా ముగించాలి మనం... కాసేపట్లో రేస్ మొద లవుతుంది.'' అన్నాడు కిటికీలోంచి పెడాక్ వంక చూస్తూ. అప్పటికే అక్కడ గుర్రాల జీన్‌లతో జాకీల బరువులు తూస్తున్నారు. రవికాంత్ తప్ప అతనితో వచ్చిన వాళ్ళందరూ రేస్‌కోర్స్‌కు మొదటిసారిగా వచ్చినవాళ్ళు కావడంతో వాళ్ళకా దృశ్యం చూపుతూ, ''రేస్ పూర్తయ్యాక కూడా ఇలాగే తూస్తారు. బరువులో ఏ మాత్రం తే డా వచ్చినా డిస్ క్వాలిఫై చేస్తారు...''! అని చెప్పాడు.

సాగరికా వాళ్ళు తినడం ముగించారు. భోంచేస్తున్న వీళ్ళ పక్కనుంచే నడుస్తూ హాల్లోంచి వెళ్ళిపోయారు. వెళ్తూ వెళ్తూ వీళ్ళ వంకోసారి చూసింది సాగరిక. ఆమె దృష్టి అనిరుద్ధ్‌పై నిలిచిందొక్క క్షణం.

వెళ్తూన్న సాగరిక వంకే చూస్తూన్న రవళి ఆమె కాస్త కనుమరగవగానే ''ఆ డ్రెస్ చూశావా మావయ్యా ఎంత బావుందో... ఏ న్యూయార్క్ లోనో కొని ఉంటుంది. భుజానికి వేలాడే ఆ పర్సు ఫెండీ అనే యూరోపియన్ కంపెనీ వాళ్ళ కొత్త మోడల్ నేను ఇంటర్నెట్‌లో చూశాను. దాని ఖరీదు పన్నెండు వందల డాలర్లు. ఆమె మెడలోని లాకెట్, చెవులకున్న సాలిటేర్ దుద్దులూ చూశావా కనీసం పాతిక లక్షలన్నా అవుతాయోమో... రేపు కాలేజీలో ఫ్రెండ్సందరికీ చెబుతాను ఆమెనింత దగ్గరగా చూశానని...'' కళ్ళు మెరుస్తూండగా అన్నది.

లంచ్ అయ్యాక మెంబర్స్ ఎన్‌క్లోజర్‌లో వెళ్ళి కూర్చున్నారు. మొదటి రేసు అనౌన్స్‌మెంటు వినిపిస్తూంది. ఎలక్ట్రానిక్ బోర్డ్ గుర్రాల ధరలూ, ఇతర వివరాలూ చూపుతూంది. గుర్రాలు పరిగెత్తడానికి సిద్ధంగా నిల్చున్నాయి. ఈ పందెంలో తొమ్మిది గుర్రాలూ పాల్గొంటున్నాయి. అన్ని గుర్రాలకూ నంబర్లు వేసి ఉన్నాయి. రేస్ మొదలయ్యింది. వైడ్ డిజిటల్ స్క్రీన్‌పై పరిగెడుతున్న గుర్రాలు, వాటితో పాటు వేగంగా పరిగెడుతూన్న జీపూ కనిపిస్తున్నాయి. 1100 మీటర్ల రేస్ అది. గుర్రాలన్నీ పోటాపోటీగా పరిగెడుతున్నాయి. అంతటా ఉత్కంఠత నెలకొంది. కమాన్ శివాజీ... కమాన్ అని కొందరూ, కమాన్ క్లౌడ్‌నైన్ అని కొందరూ అంటూ తట్టుకోలేక సీట్ల లోంచి లేచి నిలబడుతున్నారు. మరి కొందరు ఫెన్స్ వరకు పరుగులు పెడుతున్నారు. వంద మీటర్లుందనగా వెనకాలున్న గుర్రం ఒకటి పుంజుకొని ముందుకు దూసుకు వచ్చింది. క్లౌడ్‌నైన్, శివాజీనీ దాటుకొని పరిగెత్తి మొద టి స్థానం చేజిక్కించుకుంది. ఎవ్వరూ ఊహించని ఫలితం రావడంతో ఉత్కంఠ స్థానే ఆశ్చర్యం, నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి చాలా మంది మొహాల్లో రేసు ఫలితాలు ప్రకటించాక స్క్రీన్‌పై స్లోమోషన్‌లో మళ్ళీ చూపుతున్నారు. అనూహ్యంగా గెలిచిన ఆ గుర్రం పై పందెం గెలిచిన వాళ్ళు డబ్బు తెచ్చుకోవడానికి బెట్టింగ్ కౌంటర్ల వైపు వెళ్తున్నారు. మరో ఇరవై నిమిషాల్లో రెండో రేసు మొదలవుతుంది. ఎలక్ట్రానిక్ బోర్డు ఆ రేసు వివరాలు తెలుపుతూంది.




పందెం ఓడిన ముకుందం, రాజేశ్వరరావుల మొహాలు వాడిపోయి ఉన్నాయి. ముకుందం రెండో రేసు వివరాల కోసం బోర్డ్ వంక చూసాడు.

''ఒరేయ్ ఈ రేసులో గెలుపు గుర్రం తప్పక త గుల్తుందిరా'' అంటూ బెట్టింగ్ షాట్ ఇవ్వడానికి బుకీస్టాల్ వైపు వెళ్ళాడు. అది స్నేహితుని స్టాల్ వెంటనే డబ్బు కట్టక్కర్లేదు. నోటిమాట మీద పందెం కాయచ్చు అనుకున్నాడు. మార్వాడీ కూడా పందెం కాయడానికి బుకీస్టాల్ వైపు వెళ్తున్నాడు. ఇందాకటి రేసులో అతను పందెం కాసిన గుర్రం గెలిచినట్టుంది. వె లిగిపోతూన్న అతని మొహం ముందు చెవిపోగులు వెలవెలబోతున్నాయి.

రవికాంత్ వాళ్ళు ఆ రెండోరేసులో సరదాగా పందెం కాయాలనుకున్నారు. ''నేను టానాలా టికెట్ కొంటాను మావయ్యా'' అన్నాడు రాకేష్. మూడు గుర్రాలు సాధించిన స్థానాల పై పందెం డబ్బు పెట్టికొనే టికెట్స్‌ని టానాలా అంటారని అంతకు ముందే రేస్ ప్రోగ్రామ్ బుక్‌లో చదివి తెలుసుకున్నాడు మధు.

''నేను క్విన్నెలా టికెట్స్ తీసుకుంటాను'' అన్నది రవళి ఉత్సాహంగా.

ఏమీ మాట్లాడకుండా ఎలాంటి ఆసక్తీ చూపకుండా దిగులు కళ్ళతో కూర్చున్న అనిరుద్ధ్ వంక చూస్తూ ''పద... పద బెట్టింగ్ టికెట్స్ కొందాం'' అంటూ చెయ్యి పట్టుకు లాగాడు రాకేష్.

''నువ్వెళ్ళరా'' అంటూ చేయి విడిపించుకుంటున్న అనిరుద్ధ్‌ని చూసి ''ఎందుకలా డల్‌గా ఉన్నావు సుస్తీగానీ చేసిందా'' అడిగాడు రవికాంత్.

''కాదు మావయ్యా వాళ్ళింట్లో ఏదో సమస్యతో బాధ పడుతున్నారు...వీడూ తన మూడ్ బాగా లేదు రానన్నాడు. కానీ ఇక్కడికి వస్తే యీ వాతావ

రణం చూసి ఎంజాయ్ చేస్తాడనుకొని బలవంతంగా లాక్కువచ్చాను... కానీ ఇలా...'' రాకేష్ చెబుతూంది వింటూన్న రవికాంత్ ఒక్క క్షణం అనిరుద్ధ్ వంక చూశాడు. అతని కళ్ళల్లో గూడుకట్టుకున్న దిగులు సమస్య పెద్దదే అని చెబుతూంది. అతని భుజం పై ఓదార్పుగా చేయివేస్తూ ఏం జరిగింది అనిరుద్ధ్ నాతో చెప్పు. చెప్పుకుంటే కొంత మనసు తేలిక పడుతుంది...'' అన్నాడు.

అనిరుద్ధ్ ఒక్కక్షణం సంశయించినా చెప్పడం మొదలుపెట్టాడు. ''అక్క పెళ్ళి కోసం అప్లయ్ చేసిన లోను శాంక్షనవలేదని ఇంట్లో అంతా కంగారు పడుతున్నారండీ, పెళ్ళి వారంలోకి వచ్చేసింది ఇంకా ఏ పనులూ మొదలు పెట్టలేదు. అదీ గాక పెళ్ళికి రెండ్రోజుల ముందే ఐదులక్షల కట్నం డబ్బు వాళ్ళ చేతికందాలని షరతు పెట్టారు మగపెళ్ళివారు. అక్కకు ఇంకా ఈ విషయాలేవీ తెలియవు. పెళ్ళికొడుకు మాత్రం దానికి బాగా నచ్చాడు. ఏం జరుగుతుందో ననే ఆరాటంతో రెస్ట్‌లెస్‌గా ఉంది నాకు... అక్కడ వాళ్ళు బాధలో ఉంటే నేనిక్కడ ఎంజాయ్ చెయ్యటం గిల్టీగా అన్పిస్తూంది. వెళ్ళిపోతాను...'' అంటూ లేచాడు. అప్పుడే అనౌన్స్‌మెంట్ వినిపించింది క్యారీడోవర్‌తో కలిసి జాక్‌పాట్ మొత్తం డబ్బు పధ్నాలుగు లక్షలుందనీ 2,3,4,5,7 రేసుల్లో మొదటి స్థానం సాధించిన గుర్రాల నంబర్లు కాంబినేషన్ అనీ... అది వింటూనే వెళ్ళబోతూన్న అనిరుద్ధ్ ఒక్క క్షణం ఆగాడు. అది గమనించిన రాకేష్ అతని చెయ్యి పట్టుకొని ''ఒరేయ్ వై డోంట్ యూ ట్రై యువర్ లక్'' అన్నాడు. ఆలోచనలో పడ్డట్టుగా ఉన్న అనిరుద్ధ్ జేబు తడిమి చూసి వందరూపాయల నోటు బైటికి తీశాడు. అది చూసిన రవికాంత్ అన్నాడు ఐదు రూపాయలకో టికెట్ అంటే ఇరవై కాంబినేషన్లు కొనచ్చు అని అనిరుద్ధ్ రేస్ ప్రోగ్రామ్ బుక్ తీసుకొని పేజీలు తిరగేసాడు. చకచకా కాంబినేషన్లు సెట్ చేస్తూ రాకేష్‌తో ''ఒరేయ్ ఈ రోజటి బెస్ట్ గుర్రం యువరాజ్ అట! డర్బీ రేసులో పరిగెత్తుతూంది. ఐదో రేసులో ఐదునంబర్ గుర్రం అది. ఆ నంబరుతో ఉన్న కాంబినేషన్లే ఎక్కువ తీసుకోవాలనుకుంటున్నాను'' అన్నాడు

వాళ్ళ మాటలన్నీ పక్క బ్లాక్‌లో కూర్చున్న సాగరికకు విన్పిస్తూనే ఉన్నాయి. ఆమె బృందాన్ని కుతూహలంగా గమనిస్తూంది. అనిరుద్ధ్, రాకేషులు వెళ్ళి జాక్‌పాట్ టికెట్స్ కొనుక్కొని వచ్చారు. రెండో రేసు మొదలయ్యింది. అందరి దృష్టి రేసింగ్ ట్రాక్ వైపు మళ్ళింది.

***

2,3,4 రేసులు పూర్తయ్యాయి. కాసేపట్లో ఐదో రేసు మొదలవుతుంది. అదే ముఖ్యమైన ఈవెంట్ డెక్కన్‌డర్బీ రేసు. సేఠ్‌జీ బుకీస్టాల్ దగ్గర నిల్చున్నాడు. ఆ రేసులో యువరాజ్ అనే గుర్రం ఫేవరేటు. చాలా మంది అది గెలవటం ఖాయం అనే నమ్మకంతో ఉన్నారు. కానీ క్లియోపాత్రా కూడా ఆ రేసులో పాల్గొంటుంది. నరేంద్రనాథ్‌గారు మనవరాలితో వచ్చారు. ఆ గుర్రం వాళ్ళదే... ఇంత వరకూ ఎక్కడా ఓటమి చవిచూడలేదు. మంచి బ్రీడ్ కూడా దాని బాడీ లాంగ్వేజ్ చూస్తూంటే గెలవచ్చనే నమ్మకం కల్గుతూంది. సేఠ్ బుర్ర చురుకుగా ఆలోచించింది. అతని పెదాలపైకి దూసుకొచ్చిన చిరునవ్వుతో అతని తెలివైన నిర్ణయం పట్ల నమ్మకం తొంగిచూస్తూంది. వెంటనే ''క్లియపాత్రా''అని బుకీకి చెబుతూ ఒక వేలు చూపించాడు.

అది గమనించిన ముకుందం స్నేహితునితో అంటున్నాడు ఆ సేఠ్ కేదో ఇన్‌ఫర్‌మేషన్ ఉన్నట్టుంది. ఒక వేలు చూపి పేటి అన్నాడంటే లక్ష పందెం అన్నమాట. నేనూ క్లియోపాత్రా మీద వెయ్యి రూపాయలు పందెం కాస్తున్నాను.'' ఆ మాటలు విన్న రాజేశ్వరరావు ''వద్దు ముకుందం నేను రిస్కుతీసుకోలేను. డేస్ బెస్ట్ గుర్రం యువరాజ్ మీదే పందెం పెడతాను'' అని ఐదు వందలు కాసాడు.

పెడాక్‌లో జనానికి కన్పించేలా ఆ రేసులో పరిగెత్తే గుర్రాలు వలయాకారంలో తిరుగుతున్నాయి. బ్రౌన్‌కలర్‌లో రాజసం ఉట్టిపడుతున్నట్లుగా హుందాగా తిరుగుతున్నాడు యువరాజ్. క్లియోపాత్రా రాణీవాసపు హొయలొలికిస్తూ బింకాలు పోతున్నట్లుగా ఉంది. గ్రే కలర్‌లో సొగసులొలికిస్తూంది చాందినీ... అలా గుర్రాలన్నీ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నట్టుగా తిరుగుతున్నాయి. ఎందరి జాతకాలనో అవి తిరగరాస్తాయి. పంటర్లు వాటి వంక చూస్తూ తమ అభిమాన గుర్రాన్ని పేర్లు పెట్టి హుషారుగా పిలుస్తూ ఈలలు వేస్తూ... చేతులూపుతున్నారు.

సాగరిక ఒక్కసారి తన గుర్రం వంక గర్వంగా చూసుకుంది. ఎక్కడా ఓటమి ఎరగని తన క్లియోపాత్రా మొదటిసారిగా డర్బీలో పాల్గొంటూంది. గెలిస్తే భలే బావుంటుంది కదా...! అనుకుంటూన్నంతలో పక్క నుంచి మాటలు విన్పిస్తున్నాయి. అటు చూసింది ఆమె. అనిరుద్ధ్ చేతిలోని టికెట్‌ను చూస్తూ అంటున్నాడు రవికాంత్–

''2,3,4 రేసుల్లో ఈ టిక్కెట్ కాంబినేషన్ గుర్రాలన్నీ టాప్ చేశాయి. ఈ ఐదో రేసులో యువరాజ్ గెలిస్తే ఈ టికెట్ మీద నువ్వు జాక్‌పాట్ డబ్బులో ముప్పైశాతం గెలుచుకున్నట్టే...'' ఉద్వేగంగా ఉంది అతని కంఠం.

ఆ మాటలకు అనిరుద్ధ్ కళ్ళలో ఆశేదో తళుక్కుమన్నది. పధ్నాలుగు లక్షల్లో ముప్పైశాతం...! తన అక్కయ్య పెళ్ళి సునాయసంగా జరిగిపోతుంది...గెలిస్తే ఎంత బాగుంటుంది అనుకుంటూ యువరాజ్ వంక చూస్తున్నాడు.

''డేస్ బెస్ట్ యువరాజ్ తప్పక గెలుస్తుంది


THE BEST
RETAILER AWARD
2007-2008
CMAI

బాలురకై
ప్రతి రోజు
సరికొత్త ఫ్యాషన్లు



CHERMA'S®
365 రోజులూ మీ డబ్బుకు
ఖచ్చితమైన విలువనిచ్చే
సకుటుంబ రెడీమేడ్
గార్మెంట్ షాపు

చూడు'' అంటూంది రవళి.

మరి కాసేపట్లో తేలబోయే ఫలితం కోసం అతనిలో అవధులు దాటుతూన్న భావోద్వేగాన్ని నియంత్రించుకోవడానికన్నట్లుగా లేచి నిల్చున్నాడు అనిరుద్ధ్... మళ్ళీ ఓసారి టికెట్ వంక చూసుకున్నాడు. వాళ్ళు కూర్చున్న బ్లాక్ చివరి వరకూ వెళ్ళి స్క్రీన్ పైన చూపుతూన్న గుర్రాల్ని చూస్తున్నాడు. అప్పటిదాకా వాళ్ళను గమనిస్తూన్న సాగరిక లేచింది. ''తాతయ్యా రేస్ మొదలవడానికి పదినిముషాలుందిగా టీ తాగి వద్దామా.. కాస్త తలనెప్పిగా ఉంది'' అన్నది.

''అయ్యో... టాబ్లెట్ తెప్పించమంటావా'' కంగారుగా అంటూ లేచాడు, ఇద్దరూ రేస్‌క్లబ్ క్యాంటీన్ వైపు నడిచారు.

***


పెడాక్‌లోంచి గుర్రాలు బయటికి వచ్చాయి... కౌంట్‌డౌన్ మొదలయ్యింది... గుర్రాలు పరుగు ప్రారంభించాయి. 1600 మీటర్ల పందెం అది. పదకొండు గుర్రాలు పరిగెడుతున్నాయి. పోటీ అంతా ఐదారు గుర్రాల మధ్యే కనిపిస్తుంది. మిగితావన్నీ బాగా వెనకబడి ఉన్నాయి. మొదట్లో కాస్త నింపాదిగా పరుగెత్తిన క్లియోపాత్రా అకస్మాత్తుగా ఊపందుకొని పరుగెడుతూంది. తనకంటే ముందున్న చాంద్‌నినీ, యువరాజ్‌నీ దాటుకొని దూసుకెళ్ళింది. దాంతో యువరాజ్ జాకీ తన సర్వశక్తులూ ధారపోస్తూ గుర్రాన్ని పరుగుపెట్టిస్తున్నాడు. పోటాపోటీగా మూడు గుర్రాలూ పరిగెడుతున్నాయి. ప్రేక్షకుల్లో భరించలేనంత ఉత్కంఠతో నిశ్శబ్దం అలుముకుంది. చివరగా యువరాజ్ క్లియోపాత్రాల మధ్య తీవ్రపోటీ మొదలయ్యింది. లక్ష్యానికి దగ్గరగా వచ్చాయి. ప్రేక్షకుల్లోంచి కమాన్ యువరాజ్... క్లియోపాత్రా కమాన్ అరుపులు మిన్నుముట్టాయి. అనిరుద్ధ్ మొహంలో చెప్పలేనంత ఉద్వేగం, ఉత్కంఠ... రవళి, రాకేష్‌లు నోళ్ళుతెరుచుకొని చూస్తున్నారు. సాగరిక తాతయ్య చేయి పట్టుకొని అటే చూస్తూంది. ఆమె కళ్ళలో ఆరాటం... ఆయన ''సాగరీ బీ కూల్...'' అంటూ మనవరాలి చేయి నిమురుతున్నాడు. గుర్రాలు లక్ష్యానికి చేరువైనాయి. ఏది ముందో ఏది వెనకో తెలియనట్లు సరిసమానంగా పరిగెడుతున్నాయి క్లియోపాత్రా, యువరాజ్‌లు ఒకేసారి గీత దాటుతూన్నట్లున్నాయి. ఉద్వేగంతో ప్రాణాలు పోతూన్నట్టుగా ఉంది అందరి పరిస్థితీ... ఫలితం ప్రకటించారు. ఫోటో ఫినిష్‌లో యువరాజ్ గెల్చిందని... దాంతో అప్పటిదాకా నెలకొన్న ఉద్విగ్న వాతావరణం సడలింది. పందెం గెలిచిన వాళ్ళ మొహాల్లో సంతోషం వెల్లివిరుస్తూంది. ఓడిన వాళ్ళమొహాలు వాడిపోయాయి. లక్ష పోగొట్టుకున్న సేఠ్‌జీకి చెమటల్లుపట్టాయి. తన అతితెలివికి తనని తానే నిందించుకుంటూ తలకు చేయి పెట్టుకొని కూర్చున్నాడు. ఓడిన ముకుందాన్ని ఖాళీ జేబు వెక్కిరించింది. చిన్నింటికి పట్టుచీర కాదుకదా మల్లెపూలు కూడా పట్టుకెళ్ళలేని దుస్థితి వచ్చింది. పందెం గెలిచి, గండం గడిచిన రాజేశ్వరరావు మొహం దీపావళి మతాబులా వెలిగిపోతూంది. జరిగింది నమ్మశక్యం కానట్లుగా అచేతనంగా నిలబడిపోయిన అనిరుద్ధ్‌ని స్నేహితులు అభినందిస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తూన్న నరేంద్రనాథ్‌గారు మనవరాలి తలని హృదయానికి హత్తుకుంటూ గాడ్ బ్లెస్ యూ మై చైల్డ్'' అన్నారాయన. ''థాంక్యూ తాతయ్యా'' అంటూ ఆయన ఎదపై తలవాల్చింది. ఇందాక క్యాంటీన్‌లో తమిద్దరి మధ్యా జరిగిన సన్నివేశం గుర్తొచ్చిందాయనకి. ''తాతయ్యా చిన్నప్పట్నించీ ప్రతీ పుట్టిన రోజుకీ నాకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చేవాడివి... ఈసారి నేను కోరిన కానుక ఇస్తారా...!'' గారాంగా అడిగిన మనవరాలి వంక ఆశ్చర్యంగా చూస్తూ... ''ఏంటో చెప్పమ్మా...'' అన్నాడు.

''క్లియోపాత్రా ఓటమి...''

ఆయనకర్థమైంది తమ ముందు సీట్లల్లో కూర్చున్న వాళ్ళు మాటలు సాగరిక విన్నదని.

''దాని కోసం క్లియోపాత్రా ఓడటమెందుకు ఆ డబ్బేదో మనమే ఇచ్చేస్తే...'' అన్నాడు.

''వద్దు తాతయ్యా మనకుంది కదా అని దాక్షిణ్యం చూపితే వాళ్ళు తీసుకోవాలని లేదుగా. ఇలా అనుకోకుండా తమకే కలిసొచ్చిన దాంట్లో థ్రిల్ ఉంటుంది కదా...!'' మనవరాలి సంస్కారానికి గర్వపడ్డాడు... గబగబా పెడాక్ వైపు నడిచాడు. జాకీకి కనిపించేలా నిల్చొని బొటన వేలు కిందికి నేల వైపు పెట్టి చూపాడు.




రేసు జరగబోయే ముందు జరిగిన దాన్ని నెమరువేసుకుంటూన్న ఆయన ''వెళ్దామా తాతయ్యా'' అన్న సాగరిక మాటలకు తల వూపుతూ కదిలాడు స్టేబుల్‌లో ఉన్న క్లియోపాత్రా దగ్గరకు వెళ్లిందామె. దాని మెడని హత్తుకొని చెవుల మధ్య ముద్దు పెట్టుకుంది. ''సారీ డార్లింగ్ నీకో మచ్చ మిగిల్చాను'' అనుకున్న సాగరిక కళ్ళు చెమర్చాయి. కానీ ఓ పడుచుపిల్ల తన వివాహం గురించి కట్టుకున్న స్వప్నసౌధం పేకమేడలా కుప్పకూలకుండా శాశ్వతం చేశానన్న సంతృప్తితో ఆమె హృదయం నిండిపోయింది. ''క్లియో, నీకూ యిందులో వాటా వుంది'' అంటూ ఆపేక్షగా దాని వెన్ను నిమిరింది సాగరిక.

★